

# చంటబ్బాయి తాలూకా

వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'శ్రీ కాకుళం షెర్లాక్ హోమ్స్'. అనన్య నాగళ్ల, సియా గౌతమ్ కీలక పాత్రధారులు. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నపూస రమణారెడ్డి నిర్మాత. వంశీ నందిపాటి చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ సక్సెస్ మీట్‌ని నిర్వహించారు. ట్రైలర్ మూడు మిలియన్ వ్యూస్‌ని క్రాస్ చేయడం బిగ్ ఎచీవ్‌మెంట్ అని, కథను నమ్మి చేసిన సస్పెన్స్ థ్రిల్లర్ ఇదని, కథనం అద్భుతంగా ఉంటుందని, సినిమా పూర్తవ్వగానే పార్ట్ 2 ఎప్పుడని అడుగుతారని వంశీ నందిపాటి చెప్పారు. 'ఉత్తరాంధ్ర నేపథ్యంతో కూడిన కథ కావడంతో వెన్నెల కిశోర్‌తోపాటు ఆర్టిస్టులంతా ఆ యాసను ప్రాక్టీస్ చేసి నటించారు. రాజీవ్‌గాంధీ హత్య జరిగిన రోజు జరిగే కథ ఇది. ఆయన విశాఖ పర్యటన ముగించుకుని శ్రీపెరంబదూర్ వెళ్లారు. అక్కడ హత్యకు గురయ్యారు. అలాంటి పెద్ద సంఘటన జరిగినప్పుడు చిన్న సంఘటనల్ని ఎవరూ పట్టించుకోరు. ఆ రోజు జరిగిన కొన్ని కల్పిత ఘటనల చుట్టూ అల్లుకున్న కథ ఇది. సినిమా అన్‌ప్రిడిక్టబుల్‌గా ఉంటుంది.'అని దర్శకుడు రైటర్ మోహన్ పేర్కొన్నారు. ఇంకా అనన్య నాగళ్ల, నిర్మాత వెన్నపూస రమణారెడ్డితోపాటు చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

# ఆ ప్రేమ పేజీ తీయనా..



'నాలైఫ్‌లోనున్న ఆ ప్రేమ పేజీ తీయనా.. పేజీలో రాసున్న అందాల ఆ పేరు మీనా.. ట్రైనర్‌గా నేనుంటే ట్రైనీగా వచ్చిందా కూనా.. వస్తునే వెలుగేదో నింపింది ఆ కళ్ల లోనా.. చిత్రంగా ఆ రూపం.. చూపుల్లో చిక్కిందే.. మత్తిచ్చే ఓ ధూపం.. ఊపిరిలో జల్లిందే..' ఈ సాహిత్యం వింటే ప్రేమించిన అమ్మాయిని గుర్తు చేసుకుంటూ అబ్బాయి పాడే పాట అని ఎవరైనా ఇట్టే చెప్పేస్తారు. అయితే.. దర్శకుడు అనిల్ రావిపూడి ఇంకాస్త కొత్తగా ఆలోచించాడు. తన ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటూ భర్త పాడే పాటగా దీన్ని చిత్రీకరించాడు. ఆ భర్త విక్టరీ వెంకటేశ్ కాగా.. భార్య ఐశ్వర్య రాజేష్. ఇక ప్రేయసి ఎవరో తెలిసిందేగా.. మీనాక్షి చౌదరి. రానున్న సంక్రాంతికి సందడి ఏ స్థాయిలో ఉండనుందో ఈ పాటతో చెప్పేశారు 'సంక్రాంతికి వస్తున్నాం' టీమ్. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు, తొలిపాటగా విడుదలైన 'గోదారి గట్టు'కు అద్భుతమైన స్పందన వస్తున్న నేపథ్యంలో గురువారం విడుదలైన ఈ రెండో పాట.. తొలిపాటను మించేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ప్రణవి ఆచార్యతో కలిసి ఆలపించారు. వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి.

# 'బలగం' మొగిలయ్య కన్నుమూత



**తెలంగాణ జానపద కళాకారుడు** 'బలగం'ఫేం మొగిలయ్య(67) కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆయన్ను వరంగల్ సంరక్ష ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మొగిలయ్య తుదిశ్వాస విడిచారు. తెలంగాణ నేపథ్య కథాంశంతో వేణు ఎల్దండి దర్శకత్వం వహించిన 'బలగం' సినిమా మొగిలయ్యకు గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ సినిమా క్లైమాక్స్‌లో మొగిలయ్య నటిస్తూ పాడిన 'తోడుగా మాతోడుండీ.. నీడగా మాతో నడిచీ.. నువ్వెట్టా ఎల్లీనావూ కొమరయ్యా... నీ జ్ఞపకాలు మరువమయ్యో కొమరయ్యా..' పాట ప్రేక్షకుల్ని కంటతడి పెట్టించింది. మొగిలయ్య చికిత్స కోసం అగ్రనటుడు చిరంజీవి, బలగం దర్శకుడు వేణు ఆర్థిక సాయం కూడా చేశారు. కానీ ఆయన ప్రాణాలు మాత్రం దక్కలేదు. మొగిలయ్య మరణంతో ఆయన స్వగ్రామమైన దుగ్గొండిలో విషాద ఛాయలు అలముకున్నాయి. మొగిలయ్య మృతి పట్ల నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు వేణు సంతాపం వెలిబుచ్చారు. తెలంగాణ సంస్కృతినీ, మూలాలను తన గానంతో భావితరాలకు తెలియజెప్పిన గొప్ప కళాకారుడు మొగిలయ్య అని వారు కొనియాడారు.

# మోగ్లీ 2025 మొదలైంది



రోషన్ కనకాల కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ గురువారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. హీరోహీరోయిన్లు రోషన్ కనకాల, సాక్షిసాగర్ మదోల్కర్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా క్లాప్ ఇవ్వగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్క్రిప్ట్‌ని దర్శకుడికి అందించారు. వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని, వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రామ మారుతి.ఎం, సంగీతం: కాలభైరవ.



# అతని ప్రేమ.. అతని కోపం..

'క'తో తొలి బ్లాక్‌బస్టర్ అందుకున్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన చేస్తున్న తాజా సినిమాకు 'దిల్ రూబా' అనే టైటిల్ ఖరారు చేశారు. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి విశ్వ కరుణ్ దర్శకుడు. రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి, సారెగమ నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని గురువారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం యూనిక్ స్టైల్‌లో, యాటిట్యూడ్‌తో కనిపిస్తున్నారు. హీరో పాత్రను ఆవిష్కరించేలా పోస్టర్‌పై 'హిస్ లవ్.. హిస్ యాంగర్' అనే కొటేషన్‌ను పొందుపరిచారు. ఇది రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ అని, కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో మైలురాయిలా ఈ సినిమా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: డానియేల్ విశ్వాస్, సంగీతం: సామ్ సీస్.



# ఈ ప్రయత్నం ఎవరూ చేయలేదు

'నేను 'అన్వేషణ' తీయడానికి ప్రేరణ హిచ్‌కాక్. ఆయన తీసిన 53 సినిమాలూ చూసిన వ్యక్తిని నేను. నా ఆఫీస్‌లో ప్రతి గోడపై ఆయన గుర్తులుంటాయి. సినిమాకు అవసరమైనవి మూడు. 'స్క్రిప్ట్.. స్క్రిప్ట్.. స్క్రిప్ట్..' అని చెప్పిన గొప్ప దర్శకుడు హిచ్‌కాక్. ఆయనపై పుస్తకం వేయాలనే ఆలోచనే అద్భుతం. పులగం చిన్నారాయణ, రవి పాడి గొప్ప పుస్తకం తీసుకొచ్చారు. నాకు తెలిసి ఇండియాలో ఎవరూ చేయని ప్రయత్నమిది. ఇది మళ్లీ రీ ప్రింట్‌కి రావాలి.'అని ప్రఖ్యాత దర్శకుడు వంశీ అన్నారు. విశ్వవిఖ్యాత దర్శకుడు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, అలాగే ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు పూర్తయిన సందర్భంగా హిచ్‌కాక్ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ.. ఐఆర్ఎస్ అధికారి రవి పాడితో కలిసి పుస్తకం తీసుకొచ్చారు. ఈ పుస్తకాన్ని దర్శకుడు వంశీ ఆవిష్కరించి, తొలి ప్రతిని దర్శకుడు హరీశ్ శంకర్‌కి అందించారు. రెండో ప్రతిని నటుడు నాజర్‌కు అందజేశారు. తొలి ప్రతిని సంతోషం పత్రిక అధినేత సురేశ్ కొండేటి ఐదువేల రూపాయలిచ్చి కొనుగోలు చేశారు. ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్ ఈశ్వర్ డిజైన్ చేసిన ఈ బుక్ కవర్ పేజీ ఫ్రేమ్‌ని దర్శకులు ఇంద్రగంటి మోహనకృష్ణ ఆవిష్కరించారు. 45మంది దర్శకులు, ఏడుగురు రచయితలు, పదిమంది జర్నలిస్టులు రాసిన 62వ్యాసాలు ఇందులో ఉన్నాయని రచయితలు పులగం, రవి పాడి తెలిపారు. ఇంకా దర్శకులు వీరశంకర్, చంద్రసిద్ధార్థ, శివనాగేశ్వరరావు, కరుణకుమార్, వర ముళ్లపూడి, దేవిప్రసాద్, సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మను ఆవిష్కరించాం



'తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది. ఈ నేలలో అంతర్లీనంగా అద్భుత శక్తి దాగుంది. తెలంగాణలోని ప్రతి అంశంపై సినిమా తీయొచ్చు. ఈ క్రమంలో తెలంగాణ ఉద్యమానికి తెరరూపాన్నిస్తూ చేసిన సినిమానే 'డెక్కన్ సర్కార్'. పోరాటాలకు విరామం ఉండదనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశాను. తెలంగాణ ఆత్మను ఆవిష్కరించిన సినిమా ఇది. త్వరలో నిజామాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నాం.' అని దర్శకుడు కళా శ్రీనివాస్ అన్నారు. ఆయన నటిస్తూ.. స్వీయదర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'డెక్కన్ సర్కార్'. ఈ సినిమా పోస్టర్, టీజర్ లాంచ్ కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా కళా శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సినిమాలో భాగం అవ్వడం పట్ల ఘర్షణ శ్రీనివాస్, నటి హేమ ఆనందం వెలిబుచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నారెడ్డి, తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బరాబర్ ప్రేమిస్తా



చంద్రహాస్ హీరోగా రూపొందిన సినిమా 'బరాబర్ ప్రేమిస్తా'. మేఘనా ముఖర్జీ కథానాయిక. సంపత్ రుద్ర దర్శకుడు. గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అగ్ర దర్శకుడు వి.వి.వినాయక్ సినిమా టీజర్‌ని విడుదల చేసి యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. హీరో మాట్లాడుతూ 'రెండో సినిమా ఎలా ఉండాలని ఆశించానో సరిగ్గా అలాంటి సినిమా 'బరాబర్ ప్రేమిస్తా'. దర్శకుడు సంపత్ సినిమాను క్లారిటీతో, క్వాలిటీగా తెరకెక్కించారు. అందరికీ నచ్చే సినిమా ఇది' అన్నారు. ఉద్వేగభరిత ప్రేమకథగా సినిమాను మలిచానని దర్శకుడు చెప్పారు. కథను నమ్మి చేసిన సినిమా ఇదని నిర్మాతలు తెలిపారు. ఇంకా యూనిట్ మొత్తం మాట్లాడారు. ఈ చిత్రానికి కథ: ఎం.ఏ.తిరుపతి, మాటలు: రమేష్‌రాయ్, కెమెరా: వైఆర్ శేఖర్, సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్.















Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.